క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా జగన్నాథం

చండూరు: గట్టుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన నామని జగన్నాథం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీ నూతన కార్యవర్గం నియామకం

నాంపల్లి : బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింహ ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా నేతాళ్ల సత్యనారాయణ, చలమల కాంతారెడ్డి, వడ్లకొండ మల్లయ్య, ప్రధాన కార్యదర్శులుగా మంటిపల్లి శ్రీశైలం, వడ్త్య భాస్కర్ నాయక్, కార్యదర్శులుగా సూదనబోయిన లింగస్వామి, వల్లపు కోటేష్, కోశాధికారిగా కుందారపు లక్ష్మయ్య, యువమోర్చా అధ్యక్షుడిగా నాంపల్లి సతీష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా రాజబోయిన వేలాద్రి, ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా పంగ ఈశ్వర్, గిరిజన మోర్చా అధ్యక్షుడిగా రమావత్ చందర్‌నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా విష్ణు, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎటెల్లి సంతోష్‌లను నియమించినట్లు నర్సింహ తెలిపారు.

మండల ప్రధాన కార్యదర్శిగా అశోక్‌గౌడ్

కనగల్ : బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన బైరగోని అశోక్ గౌడ్ ఎన్నికయ్యారు. బుధవారం అశోక్‌గౌడ్‌కు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్ గౌడ్ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో తిరందాసు కనకయ్య, గోన ప్రవీణ్‌రావు, చనగాని యాదగిరి, జనగాం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ ప్రధాన కార్యదర్శిగా ప్రమోద్

నల్లగొండ రూరల్: బీజేపీ నల్లగొండ మండల ప్రధాన కార్యదర్శిగా ఖుదావన్‌పూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి ప్రమోద్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ మండల అధ్యక్షుడు బోగరి అనిల్ బుధవారం ప్రమోద్‌కు నియామకపత్రం అందజేశారు.

పరీక్ష ప్యాడ్లు అందజేత




పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న శివలీల, బండమీద అంజయ్య

కనగల్ : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంబాల శివలీల, సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండమీది అంజయ్య బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పరమేశ్వరి, దాసోజు కృష్ణమాచారి, ఆర్ఎంపీలు భిక్షాల మహేష్, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

నకిరేకల్ : పూలే, అంబేద్కర్ జన జాతర సందర్భంగా నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటిపాక కృష్ణ పిలుపునిచ్చారు. నకిరేకల్‌లో బుధవారం కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిబాపూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఏప్రిల్ 13న నల్లగొండలోని అంబేద్కర్ భవనంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వంటిపాక వెంకటేశ్వర్లు, చిలుముల రామస్వామి, ఏర్పుల తాజేశ్వర్, ఆకుల భాస్కర్, బుచ్చిరాములు, అంబేద్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సోమన్న సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న నాయకులు

కట్టంగూర్ : మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కట్టంగూర్ మాజీ సర్పంచ్ కాపుగంటి సోమన్న చేసిన సేవలు మరువలేనివని మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సోమన్న విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి సాగర్, మిట్టపల్లి శివశంకర్, కాపుగంటి శ్రీనివాస్, బుచ్చాల వెంకన్న, కానుగు లింగయ్య, గట్టిగొర్ల సత్తయ్య, కొంపెల్లి యాదయ్య, నర్సింహ, గాదగోని వెంకన్న, చెరుకు సైదులు, రెడ్డిపల్లి వీరస్వామి, సైదులు, సతీష్, కాపుగంటి గోపి, దశరథ, నమ్ముల సత్యనారాయణ, చెరుకు శ్రీనివాస్, చిత్తలూరి జానకిరాములు పాల్గొన్నారు.

విరాళం అందజేత

మర్రిగూడ: మండలంలోని రాజాపేటతండా పరిధి పద్మశాలి కాలనీలోగల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో నవగ్రహ ప్రతిష్ఠాపనకు గ్రామ మాజీ సర్పంచ్ నూన్సావత్ సక్కుబాయిబిచ్యానాయక్ బుధవారం రూ.30వేల విరాళాన్ని అందజేశారు. అల్వాల్‌రెడ్డి, ఈశ్వర్, జయప్రసాద్, రవి, కొండలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కరువు

- నిర్లక్ష్యం వహిస్తున్న నిర్వాహకులు, అధికారులు
- గ్రామ సంఘాలకు వచ్చే కమీషన్ దుర్వినియోగం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు



నార్కట్‌పల్లి మండలంలోని ఓ ధాన్యం కొనుగోలు కేంద్రం

నార్కట్‌పల్లి : రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు వసతులు కల్పించాలని ఐకేపీ, పీఏసీఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. నార్కట్‌పల్లి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 14, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 6 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎండ ఎక్కువగా ఉండడంతో ఉదయం 5 గంటల నుంచి 11 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం సూచించింది.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ప్రభుత్వ నిబంధనల ప్రకారం నీడ, నీరు, విద్యుత్, మరుగుదొడ్లు, టార్పాలిన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను నిర్వాహకులు ఏర్పాటు చేయాలి. అయితే సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో కేంద్రాల వద్ద ఎలాంటి వసతులు ఏర్పాటు చేయడం లేదు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఏర్పాట్ల కల్పనలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిగతా సభ్యులకు తెలియకుండానే కమీషన్ డ్రా

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు వసతులు ఏర్పాటు చేసుకునేందుకు గ్రామ సంఘం (విలేజ్ ఆర్గనైజేషన్)కు చెందిన బ్యాంకు అకౌంట్‌లో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్ జమ చేస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం సేకరణ పూర్తయిన అనంతరం కమీషన్ డబ్బులు గ్రామ సంఘం (విలేజ్ ఆర్గనైజేషన్) బ్యాంకు అకౌంట్‌లో జమ అవుతాయి. ప్రతి ఏడాది వచ్చే కమీషన్‌ను కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు కల్పించేందుకు వినియోగించకుండా అధికారులు, కేంద్రాల నిర్వాహకులు దుర్వినియోగం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా వచ్చే కమీషన్ డబ్బులను వీఓఏల ద్వారా ఐకేపీ డీపీఎం, ఏపీఎం, సీసీలు సొంతానికి వాడుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రతి ఏటా ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కోసం ఎలాంటి వసతులు లేకుండా పోతున్నాయి. గ్రామ సంఘం ఖాతాలో జమ అయిన కమీషన్ మిగతా సభ్యులకు తెలియకుండానే సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సంబంధిత అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి సీజన్‌లో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి దాదాపు లక్ష రూపాయల వరకు సంపాదిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నీడ, నీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. చెట్ల నీడే మాకు దిక్కవుతోంది. రైతులు ఇంటి వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు కుండలు పెట్టి నీళ్లు పోయడం లేదు. సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు.

–చింత కృష్ణయ్య, తొండల్‌వాయి

టార్పాలిన్లు అద్దెకు తీసుకుంటున్నాం



గ్రామ శివారున ఉన్న కొనుగోలు కేంద్రం వద్దకు వచ్చిన మహిళా రైతులకు ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అకాల వర్షం వస్తే కేంద్రం వద్ద టార్పాలిన్లు లేకపోవడంతో అద్దెకు తీసుకోవాల్సి వస్తోంది. కేంద్రాల వద్ద వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

–వంగ పద్మ, నెమ్మాని

నిత్యావసర సరుకుల పంపిణీ



నల్లగొండ టౌన్ : సరుకులు అందజేస్తున్న ఫౌండేషన్ అధ్యక్షుడు వడ్డేపల్లి కాశీరాం

నల్లగొండ టౌన్ : రంజాన్ పండుగ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని 29 వార్డులో ముస్లింలకు వడ్డేపల్లి కాశీరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్డేపల్లి కాశీరాం మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 11 సంవత్సరాలుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. పట్టణంలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వడ్డేపల్లి శ్రీ మహాలక్ష్మి, మేడి శ్రావణకుమారి, ఎడ్ల కాంచనమాల, వడ్డేపల్లి ఎల్లోరా, వడ్డేపల్లి శ్రీశక్తి, వడ్డేపల్లి శ్రీ పంచమి, దుర్గాప్రసాద్, తేజ పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ కిట్లు..

కేతేపల్లి : రంజాన్ పండుగను పురస్కరించుకుని కేతేపల్లిలో టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ యూసఫ్ జానీ బుధవారం తన తండ్రి అబ్బాస్ అలీ స్మారకార్థం 50 మంది పేద ముస్లింలకు సేమియా, షీర్ కుర్మా, షుగర్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బయ్య ముత్తయ్య, కోట శ్రీనివాస్, ముస్లింలు ఎండీ అబ్బాస్, సాజిద్ బేగం, ఎస్కే సుమాన్, చాంద్, సిద్ధిక్, సలీమా, ఎస్కే లతీఫ్ పాల్గొన్నారు.

చిట్యాల: రంజాన్ పండగ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్ చిట్యాల పట్టణానికి చెందిన ట్యాక్సీ డ్రైవర్ ఎండీ.నయీముద్దీన్‌కు బుధవారం రంజాన్ కానుక అందజేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు ముస్లింలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ: లతీఫుల్లా శాఖాద్రి గుట్ట మెట్ల వద్ద ముతావలి సమీకాద్రి ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ మారగోని నవీన్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, బాబా, సల్మాన్ ఖాద్రి, తబరేజ్ ఖాద్రి, ముబీన్ ఖాన్, నవీద్, తాహెర్, అఫ్రోచ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తాం

- సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- హైదరాబాద్‌లో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నివాసంలో సీఎంను కలిసిన ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, పలు మండలాల నాయకులు



సీఎంకు డైరీ అందజేస్తున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు

చండూరు: రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించి, అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నివాసంలో బుధవారం భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులును కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పరిచయం చేశారు. కోడి శ్రీనివాసులతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై ట్రస్మా రాష్ట్ర కమిటీతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ట్రస్మా మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి కోడి శ్రీనివాసులు ట్రస్మా డైరీని బహూకరించారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

మర్రిగూడ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి ఎంపీ స్థానానికి సంబంధించి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మర్రిగూడ మండల నాయకులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బేత వెంకటేష్‌యాదవ్, మాతంగి నవీన్, ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ముద్దం నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.

నార్కట్‌పల్లి : సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో నార్కట్‌పల్లి మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు. నకిరేకల్, మునుగోడు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు, చెర్వుగట్టు మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, చెర్వుగట్టు ఆలయ డైరెక్టర్ గడ్డం పశుపతి, నార్కట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జేరిపోతుల భారత్‌లు కలిసి శాలువా కప్పి సన్మానించారు.

సీపీఎం గెలిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి



నాంపల్లి : మాట్లాడుతున్న నాంపల్లి చంద్రమౌళి

నాంపల్లి : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపిస్తే పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని సీపీఎం నాంపల్లి మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో వామపక్షాల బలం తగ్గిపోవడంతో బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కొమ్ము లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొమ్ము ముఖేష్, వెంకటయ్య, పర్వతాలు, కృష్ణ, ఎం.గీత, కవిత, జయసుధ, శ్వేత, సుజాత, నాగమణి, గిరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ఇంటింటి ప్రచారం

చిట్యాల: ప్రజల పక్షాన పోరాటం చేసే సీపీఎంకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెంలో సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న జహంగీర్‌ను పార్లమెంటు సభ్యుడిగా గెలిపించాలన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు బొబ్బలి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చొప్పరి సంధ్యారాణి, ప్రజా సంఘాల నాయకులు పాలకూల అర్జున్, బొబ్బలి వెంకట్‌రెడ్డి, దామరోజు పోతులూరి, గుండెబోయిన సాయి, కర్నెగంటి లింగయ్య, జ్యోతి, యశ్వంత్ పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

కట్టంగూర్ : కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అన్నారు. బుధవారం అయిటిపాముల గ్రామంలో లాబార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్, రూరల్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, ఉపాధి హామీ, సబ్సిడీపై ఎరువులు, ఉజ్వల గ్యాస్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గోలి మహేశ్వరి, కొత్త విజయ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నకిరేకల్ లయన్స్ క్లబ్ ప్రతినిధులకు అవార్డులు

నకిరేకల్: హైదరాబాద్‌లో జరిగిన లయన్స్ క్లబ్ రీజియన్ మీట్ అవార్డుల ఉత్సవంలో నకిరేకల్‌కు చెందిన లయన్స్‌క్లబ్ ప్రతినిధులు 9 ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నట్లు క్లబ్ రీజియన్ చైర్మన్ బాచుపల్లి రవీంద్రరావు తెలిపారు. ఉత్తమ అధ్యక్షుడిగా ఉప్పల వెంకటరమణ, ఉత్తమ సెక్రటరీగా అండెం వెంకటేశ్వర్లు, ఉత్తమ కోశాధికారిగా వరకాంతం నారాయణరెడ్డి అవార్డు అందుకున్నారన్నారు. నకిరేకల్ లయన్స్‌క్లబ్ ప్రతినిధులకు అవార్డులు రావడంపై క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ యానాల మోహన్‌రెడ్డి, జోన్ చైర్మన్ రావిరాల అశోక్, డిస్ట్రిక్ట్ చైర్మన్ ఎర్ర శంభులింగారెడ్డి, యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, బొల్లం కృష్ణమూర్తి, నెమరగమ్ముల రామ్మోహన్‌రావు, డా.రౌతు వీరబ్రహ్మం, దేవరశెట్టి పెద్ద శ్రీనివాసు, తక్కలపల్లి ప్రభాకర్‌రావు, కేవీ.ప్రసాద్, జెల్ల దశరథ, మురళీధర్‌రెడ్డి, రేపాల మదన్‌మోహన్‌లు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న నకిరేకల్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రమాదాల నివారణపై పట్టింపేదీ !



అసంపూర్తిగా నిర్మించిన గోడ

మునుగోడు: మండల కేంద్రం సమీపంలో మునుగోడు–నార్కట్‌పల్లి రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడేళ్ల క్రితం వరకు సింగిల్ రోడ్డుగా ఉన్న నార్కట్‌పల్లి రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చారు. మునుగోడు సమీపంలోని కార్మికనగర్ వద్ద మూలమలుపులో పాడుబడిన బావి ఉండడంతో వాహనదారులు అదుపు తప్పి ఆ బావిలో పడిపోతున్నారు. కొందరు మృతి చెందగా మరికొందరు గాయాలతో బయటపడ్డారు. మూడేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు చేసిన సమయంలో పాడుబడిన బావి చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. అయితే కాంట్రాక్టర్ గోడను పూర్తిస్థాయిలో నిర్మించకుండా వదిలేశాడు. దీంతో గతంలోలాగానే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల నలుగురు యువకులు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బావిలోకి దూసికెళ్లింది. ఆ యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రమాదకరంగా ఉన్న బావి వద్ద పూర్తిస్థాయిలో గోడ నిర్మించి ప్రమాదాలు జరగకుండా చొరవ చూపాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ప్లాట్‌ఫాం బోర్డులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



నల్లగొండ బస్టాండ్‌లో ప్లాట్‌ఫాం బోర్డులు లేకుండా కనిపిస్తున్న ఖాళీ బాక్సులు

నల్లగొండ రూరల్: నల్లగొండ బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్‌పై ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సులు నిలిచే స్థలాలను సూచించే బోర్డులు తొలగించడంతో రెండు రోజులుగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏ ప్రాంతానికి వెళ్లే బస్ ఏ ప్లాట్‌ఫాం వద్ద ఆగుతుందో తెలియక ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. బస్టాండ్‌లోకి వచ్చే బస్ ఎక్కడికి వెళుతుందో తెలియక ప్రయాణికులు బస్‌ల వెంట ఉరుకులు పరుగులు పెడుతున్నారు. నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ ప్లాట్‌ఫాం మీద వివిధ ప్రాంతాల పేర్లు తెలియజేసే బోర్డులు గతంలో ఉన్నాయి. ప్రస్తుతం వీటిని తొలగించి కొత్త బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులు భావించారు. అయితే కొత్త బోర్డులు వచ్చిన తర్వాత పాత బోర్డులు తొలగిస్తే బాగుండేదని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

దాతల సహకారం అభినందనీయం

చౌటుప్పల్ : దాతల సహకారం అభినందనీయమని నార్కట్‌పల్లి ఆర్టీసీ బస్‌డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్(టీ–3) ఎంవీ.చారి అన్నారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలో బాలాజీ షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దాతలు తమ వంతు సహకారం అందించాలన్నారు. కృష్ణరాంచౌదరి, కంట్రోలర్ ఆనంద్‌రావు, విలేజ్ బస్ ఆఫీసర్ బీ.రామచంద్రం, సిబ్బంది యాదయ్య, శ్రీను, నిఖిల్, కృష్ణ, సుగుణమ్మ, రజిత పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



మదీనా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సేమియా, డ్రైఫ్రూట్స్ కొనుగోలు చేస్తున్న ముస్లింలు

- పరిశీలించిన మున్సిపల్, పోలీసు అధికారులు
- దుకాణాల వద్ద ముస్లింల సందడి

రామగిరి(నల్లగొండ): పవిత్ర రంజాన్ వేడుకలను ముస్లింలు గురువారం జరుపుకోనున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డు ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలు జరగనున్నాయి. ఉదయం 8.30 గంటలకు ఈద్గా మౌలానా ఎహసానుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద గురువారం జరిగే రంజాన్ వేడుకలకు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈద్గా వద్ద ముస్లింలతో కలిసి ప్రార్థనలో పాల్గొంటారు. అనంతరం పలువురు ముస్లిం మత పెద్దల ఇళ్ల వద్దకు వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తారు.



టోపీలు కొనుగోలు చేస్తున్న యువకులు



అత్తర్ కొనుగోలు..

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

మునుగోడు రోడ్డు ఈద్గా వద్ద గురువారం జరిగే రంజాన్ ప్రార్థనల సందర్భంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, డీఎస్పీ శివరామ్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. టెంట్‌లు, మంచి నీటి సౌకర్యం, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాల్సిందికి మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ సూచించారు. ఈద్గా ఆవరణ శుభ్రం చేయించారు. ఈద్గా వద్ద ప్రార్థనలకు వచ్చే వారి వాహనాల పార్కింగ్, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చూడాలని పోలీసు సిబ్బందికి డీఎస్పీ శివరామ్‌రెడ్డి సూచించారు. వారి వెంట సీఐ డానియల్, ఈద్గా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ హఫీజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

రంజాన్ సందడి

పవిత రంజాన్ మాసం ముగింపు సందర్భంగా ఆఖరి రోజైన బుధవారం మసీదుల వద్ద ముస్లింల ప్రార్థనలు చేశారు. హరీస్ సెంటర్లు, చెప్పుల దుకాణాలు, పండ్లు, సేమియా, టోపీలు, అత్తర్ దుకాణాల వద్ద సందడి నెలకొంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్, పోలీసు అధికారులు

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరుతున్న యువకులు

నల్లగొండ టూటౌన్: వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు బుధవారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ మూడోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజు యాదవ్, పోతెపాక సాంబయ్య, పోతెపాక లింగస్వామి, ఫకీర్, మోహన్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, కంకణాల నాగిరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.